జులై 14 నుంచి బీఈడీ,ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ,ఎంఈడీ కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు జులై 14 వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు వై వి యు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు తెలిపారు. బీఈడీ 2వ సెమిస్టర్, 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థులకు అలానే ఎంఈడి రెండు, నాలుగు సెమిస్టర్ల సప్లిమెంటరీ, రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి జరగాల్సిన బీఈడీ,ఎంఈడీ పరీక్షలను డీఎస్సీ(ఉపాధ్యాయ ఉద్యోగ నియామకపు పరీక్ష) రాసే విద్యార్థుల అభ్యర్థన దృష్ట్యా, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జులై 14 వ తేదీకి వాయిదా వేశామన్నారు. రీషెడ్యూల్ అయిన తేదీల టైం టేబుల్ విద్యార్థులు చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సూచించారు.



విశాలాంధ్ర

వైయస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

ఆదివారం, 15 జూన్ 2025 | 8 పేజీలు

ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా చేస్తా

ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో అసాంఘీక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైసీపీ సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ గతంలో నాపై మట్కా, క్రికెట్, జూదం ఆడింది వరద అనుచరులే అంటూ సోషల్ మీడియాలో వైసీపీ దుష్ప్రచారం నిర్వహిస్తున్నదని ఏవైనా ఒక్కటి నిరూపిస్తే రాజీనామా చేస్తానన్నారు. నిజాయితీ, నిష్పక్షపాతంగా రాజకీయాలు చేస్తానే తప్ప తప్పుడు మార్గంలో డబ్బు సంపాదించాల్సిన అగాత్యం తనకు లేదన్నారు. 40సంవత్సరాల నా రాజకీయ జీవితం ఎలాంటిదో ప్రొద్దుటూరు ప్రజలకు తెలుసు కాబట్టే 6వ సారి అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు. ఆర్థిక నేరగాళ్లు సోషల్ మీడియాలో ప్రసారం చేసినంత మాత్రానా ప్రజలు నమ్మరన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చడమే చంద్రబాబు లక్ష్యం:

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, పథకాలు అమలులో చంద్రబాబుకు మించిన వారు ఏ రాష్ట్రంలో లేరన్నారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం 4వేల రూపాయలు పెన్షన్ అందించామన్నారు. ప్రతి నెల 4వేలు పెన్షన్లు, వికలాంగులకు రూ.6వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15వేలు ఇవ్వడమే కాకుండా ఇంటర్మీడియట్ విధ్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుర్మార్గమైన ల్యాండ్ టైటిటింగ్ యాక్ట్‌ను రద్దు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. ఇసుక, ల్యాండ్ మరియు లిక్కర్ మాఫియాలో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన ఘనత వైసీపీదే అన్నారు. వైసీపీ పాలనలో ఎమ్మెల్యేలు, మంత్రులు రాష్ట్రాన్ని దోచుకు తిన్నారని మండిపడ్డారు. చివరకు సీఎం రిలీఫ్ ఫండ్ సైతం తమ జేబులోనే వేసుకున్నారని విమర్శించారు. ప్రజల సొమ్మును దోచుకొని, దాచుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి వైసీపీకి లేదన్నారు. ఈ సమావేశంలో టీఎన్‌టీయూసీ కడప పార్లమెంట్ అధ్యక్షులు చింతకుంట కుతుబుద్దీన్, సుధాకర్, భాస్కర్, రామాంజనేయుల రెడ్డి, తాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కడప -తిరుపతి జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టండి.!

మితిమీరిన వేగం.. నిర్లక్ష్యం.. -తల్లిదండ్రులకు గర్బశోశాన్ని మిగిల్చుతున్న ప్రమాదాలు

సత్ఫలితాలివ్వని పోలీసుల చర్యలు -తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ప్రమాదాలు

విశాలాంధ్ర-రాజంపేట: జీవితమంటే లెక్క లేదు.. ప్రాణాలంటే భయం లేదు. ఏమవుతుంది లేనన్న నిర్లక్ష్యం.. చట్టాలపై చిన్న చూపు.. వెరసి ఒళ్ళు తెలియని వేగం.. ఫలితం ప్రాణాలు గాలిలో కలిసిపోవడం! భద్రతా ప్రమాణాలు పాటించాలన్న స్పృహ ఉండదు.. మన వేగం ప్రాణాంతకరం కాకూడదన్న ఆలోచన ఉండదు. ఎన్నో విజయాలను సొంతం చేసుకుని పూలదండలతో అభినందనలు అందు కోవలసిన వయసులో ఫోటోలకు దండలు పడుతున్నాయి. క్షేమంగా ఇంటికి రావాల్సిన వారు స్మశానానికి పయనమవుతున్నారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే కడప తిరుపతి జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలు అని చెప్పడంలో సందేహం లేదు. ఈ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సువిశాలమైన ఈ రహదారి రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. అతివేగం.. మద్యం మత్తు.. నిద్రమేమి.. నిర్లక్ష్యం తదితర కారణాలతో జిల్లాలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎందరో ప్రాణాలు కోల్పోతూ గర్భశోకాన్ని మిగులుస్తోంది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలలో అనేకమంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

జిల్లాలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి

నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది. ఫలితంగా అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.మరికొందరు విగత జీవులై పోతున్నారు. జిల్లాలో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాల్లో స్వయం కృతంతో కొందరు, ఇతరుల నిర్లక్ష్యం, అతివేగం,నిద్రమత్తు వంటి కారణాలతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఖరీదైన వాహనాలు రై..రై మంటూ దూసుకెళుతూ.. చివరికి అది ప్రాణాలు మింగేసి గర్భశోకం మిగిలిస్తోంది. ఆరు గంటలు ప్రయాణం చేయాల్సిన దూరాన్ని కేవలం నాలుగు గంటల్లోనే చేరితే వచ్చే లాభం ఏమిటి! మద్యం మత్తులో ఒళ్ళు తెలియని వేగంతో జరిగే అనర్థానికి ఎవరు బాధ్యులు! వేగం ఎక్కడ అవసరం, ఎక్కడ అనవసరం అని విచక్షణ ఉండాలి. ప్రాణం తీసే వేగం, చూసేవారి నరాలు తెగిపోయే వేగం ఎన్నటికీ ప్రమాదకరమే. వేగం.. వెన్నంటి ఉండే శత్రువు.. ఇంకా చెప్పాలంటే వెంటాడే మృత్యువు. వేగం పెరిగిన కొద్దీ మృత్యువుకి దగ్గరవుతున్నట్లే, పగలైనా, రాత్రయినా ఎప్పుడు ప్రాణాంతకమే. వాహనం నడిపే వారికి, వాహనంలో ఉన్నవారికి, ప్రాణ సంకటమే. వాహనం నడిపేవాడు ఒక్కడు అజాగ్రత్తగా ఉంటే ఎన్నో ప్రాణాలకు మృత్యువు పొంచి ఉన్నట్టే. మరెందరికో గర్భశోకం గుమ్మం దాకా వచ్చినట్టే.వాహన వేగానికి మద్యం మత్తు తోడైనా, నిద్రలేమి జత కలిసినా, నిర్లక్ష్యం పేరుకు పోయినా.. మృత్యు తిష్ట వేసినట్లే! జాతీయ రహదారులపై ప్రతిరోజు ఎక్కడో ఒకచోట జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో గువ్వల చెరువు ఘాట్, నందలూరు, ఊటుకూరు, బాకరాపేట, కడప తిరుపతి జాతీయ రహదారిపై ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

స్వీయ నియంత్రణే ప్రత్యామ్యాయం:

రోడ్డు ప్రమాదాలు తగ్గాలన్నా.. మరణాల రేటు కుదించాలన్నా వేగా నియంత్రించుకోవడం మినహా మరో ప్రత్యామ్నయం లేదు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్న.. వాహనదారుడు స్వీయ నియంత్రణ అవసరం.ఇది ఒకరు చెబితే వచ్చేది కాదు. ప్రాణాలతో చలగాటం ఎప్పటికీ ప్రమాదకరమే.దుర్ఘటన జరిగిపోయిన తర్వాత బాధపడితే లాభం లేదు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత గుర్తుంచుకోవాలి.ఒక చిన్న తప్పు పెను ప్రమాదానికి దారితీస్తుంది.

మృతుల్లో యువకులే ఎక్కువ:

జిల్లాలో రోడ్డు ప్రమాదాల బారిన పడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు.ఈ సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూనే వస్తోంది. ఇందుకు ప్రధాన కారణం మితిమీరిన వేగం అని చెబుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో సగం మంది యువకులే ఉండడం గమనార్హం.వీరి మరణాలు తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుచుతోంది.

సత్ఫలితాలివ్వని పోలీసుల చర్యలు:

జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రవాణా శాఖ, పోలీసులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదని ప్రజల నుండి బహిరంగంగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లైసెన్స్, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై, త్రిబుల్ రైడింగ్, రికార్డులు లేని వాహనదారులపై ఫైన్ లు వేస్తున్నారే తప్ప ప్రమాదం జరిగే ప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టడం లేదనే అపవాదను మూట కట్టుకున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో బారికేడ్లు ఏర్పాటు చేస్తే కొంతవరకైనా ప్రమాదాలు తగ్గుతాయని ప్రజల నుండి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.20 లక్షల విలువ చేసే నగలు, నగదు స్వాధీనం -ఆరుగురు నిందితుల్ని అరెస్ట్ చూపిన పోలీసులు

విశాలాంధ్ర- మదనపల్లె : తాళం వేసి ఉన్న ఇళ్లలను లక్ష్యం చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను శనివారం మదనపల్లె రూరల్, ముదివేడు పోలీసులు, క్రైమ్ పార్టీ సిబ్బంది అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 20లక్షల విలువ గల నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. 6 మంది నిందితులను స్థానిక డిఎస్పీ కార్యాలయంలో అరెస్టు చూపారు. ఈ సందర్భంగా డిఎస్పి మహేంద్ర మాట్లాడుతూ మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న దొంగతనాల కేసులను ఛేదించే క్రమంలో క్రైమ్ పార్టీ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆరుమంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో మదనపల్లి మండలం, వేంపల్లికి చెందిన షేక్ మౌలాలి (52) కర్ణాటక రాష్ట్రం, చింతామణి తాలూకా, బూరగమాకుల పల్లెకు చెందిన ఎం శంకర (48), కురబలకోట మండలం, నంది రెడ్డిగారిపల్లె పంచాయతీ, గౌనువారిపల్లి కు చెందిన పాలెం నర్సింహులు (45) మదనపల్లె మండలం, కోటవారిపల్లి పంచాయతీ, పాకాలవారిపల్లెకు చెందిన వరగాని నవీన్ కుమార్ (30), కురబలకోట మండలం, తెట్టు పంచాయతీ, చింతమాకుల పల్లెకు చెందిన అనంత విశ్వనాథ్ రెడ్డి (65) చిత్తూరు జిల్లా, గంగవరం మండలం, మాడుగురు ప్రాంతానికి చెందిన నేరేటి రమేష్ (64) లు అంగళ్లు సమీపంలోని చేనేత నగర్ వద్ద అనుమానితంగా తిరుగు తుండడంతో అదుపులోకి తీసుకుని విచారించడం జరిగిందన్నారు. విచారణలో ఆరు చోట్ల దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి 150 గ్రాముల బంగారు ఆభరణాలు, 762 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.5.28 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీంతో పాటు నేరానికి ఉపయోగించిన రెండు ఇనుప రాడ్లు, స్క్రూ డ్రైవర్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ వీరిలో మౌలాలి పై బీ.కొత్తకోట పోలీస్ స్టేషన్లో రెండు ఎర్రచందనపు కేసులు ఉన్నాయని, నవీన్ కుమార్ పై తాలూకా పోలీస్ స్టేషన్ లో చోరీ కేసు ఉందని, అనంత విశ్వనాథ్ రెడ్డి పై ముదివేడు పోలీస్ స్టేషన్లో అక్రమ మద్యం కేసు ఉందని తెలిపారు. వీరిలో శంకర్ కర్ణాటక ఆర్టీసీ లో డ్రైవర్ కమ్ కండక్టర్ గా ప్రస్తుతం పనిచేస్తూ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ ఆరు మంది నిందితులు జల్సాలకు, ఈజీ మనీ కి అలవాటు పడి టీ దుకాణంలో కలుసుకొని ప్రణాళికతో చోరీలకు తెగబడినట్లు తెలిపారు. ముఖ్యంగా తాళం వేసిన ఇళ్ళను రెక్కి నిర్వహించి, పట్టపగలే చోరీలకు పాల్పడడం వీరి నైజమన్నారు. ఇలాంటి చోరీలకు పాల్పడే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. ఇంటిల్లిపాది ఎక్కడైనా ఊరు వెళ్లాలనుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల ఆ ప్రాంతంలో గస్తీని ముమ్మరం చేసి, చోరీలు అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్సై దిలీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. చోరీ కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ పార్టీ సిబ్బందిని డిఎస్పీ అభినందించారు.

గుజరాత్ విమాన ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరం

మండల టిడిపి సీనియర్ నాయకులు నందగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర -అట్లూరు : గుజరాత్ లో గురువారం మధ్యాహ్నం జరిగిన విమాన ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరమైనదని అట్లూరు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొవిళ్ళ. నందగోపాల్ రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. అహ్మదాబాద్ నుండి బయలుదేరిన నిమిషాల్లోనే విమానం ప్రమాదానికి గురి కావడం అందులో 241 మంది ప్రయాణికులు, విమానం బీజే మెడికల్ కాలేజీ పై పడి మరో 20 మంది మెడికో విద్యార్థులు దుర్మరణం చెందడం ఎంతో బాధాకరమైన, విషాదకరమైన సంఘటనన్నారు. ఈ ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాని మృత్యువాత పడటం బాధాకరమని తెలిపారు. విమానయాన సంస్థ టాటా మృతులకు భారీ నష్టపరిహారం ప్రకటించిందని, అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా ఆదుకుంటుందని వెల్లడించారు. సంఘటన జరిగిన వెంటనే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, హోం శాఖ మంత్రి అమిత్ సా లు చేరుకొని ఏర్పాట్లు పర్యవేక్షణ చేశారన్నారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తులకు ఆదేశించిందని త్వరలోనే వివరాలు తెలుస్తాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వ పాలనలో

ప్రజలు సంతోషంగా వున్నారు

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:బుచ్చిరెడ్డి పాళెం పట్టణ సమగ్రాభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. బుచ్చి పట్టణ పరిధిలోని 3 వ వార్డులో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి ఆమె 3 వ వార్డులోని ఇస్కపాళెం, అరుంధతివాడ, దుర్గానగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ఆమె ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి గారు అహ్మదాబాద్ లో విమాన ప్రమాదంలో అశువులు వారి ఆత్మశాంతి కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి ప్రసంగం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన 2.0 పథకంలో భాగంగా ఇళ్ళు లేని 286 నిరుపేదలకు ఇళ్ళు మంజూరు అయ్యాయన్నారు. లబ్దిదారులకు 2 లక్షల 50 వేలతో ప్రభుత్వం ఇళ్ళు నిర్మించి యివ్వనుందన్నారు. 3 వ వార్డు పరిధిలోని ఇస్కపాళెం అరుంధతి వాడలో తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కృష్ణా థియేటర్, దుర్గానగర్ ప్రాంతాలలో త్వరలోనే రోడ్లు,డ్రైన్ల నిర్మాణం చేపడతామన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు చేసుకుంటూ వేస్తున్నామన్నారు. ఇప్పటికే వివిధ వార్డులలో జనరల్ ఫండ్స్, ఎంపి లాడ్స్, సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా చేస్తున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. తేజా డెవలపర్స్ వారి సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా చేపట్టిన మార్కెట్ నిర్మాణం దాదాపు పూర్తయిందని త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. బుచ్చి పట్టణంలో విద్యుత్ ఓవర్ లోడ్ తగ్గించేందుకు పంచేడు వద్ద ఒక 33 కెవి సబ్ స్టేషన్ నిర్మాణంలో వుందని బుచ్చి పట్టణంలో మరో 33 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్వేషణ చేస్తున్నామన్నారు. నాగమాంబపురం వద్ద ఆటోనగర్ నిర్మాణంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఎన్నికలకు ముందు యిచ్చిన ప్రతి హామీ అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితోకృషి చేస్తుందన్నారు.ఈ నెల 20 న అన్నదాత సుఖీభవ పథకం, ఆగష్టు15 నుంచి మహిళలకు ఉచితబస్సు పథకాలుఅమలు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రాష్ట్రంలో గుంతల రోడ్లు మాయమయ్యాయన్నారు. మంత్రి లోకేష్ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తున్నారని రాష్ట్రంలో విస్తృతంగా ప్రతి క్లాస్ కు ఒక టీచర్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాళెం మున్సిపల్ కమీషనర్ బాలకృష్ణ, ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, స్థానిక కౌన్సిలర్ అందె ప్రత్యూష, వైస్ ఛైర్మన్లు యారటపల్లి శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్, కౌన్సిలర్లు పుట్ట లక్ష్మీ కాంతమ్మ, శ్రీదేవి బుచ్చి మండల అర్బన్, రూరల్ టిడిపి అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, బెజవాడ జగదీష్, టంగుటూరి మల్లారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు హరికృష్ణ, ఎంవి శేషయ్య, రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర యజ్ఞంగా టిటిడి అన్నప్రసాద వితరణ

దాత రూ. 44 లక్షలతో రోజంతా అన్నప్రసాద వితరణ -రోజుకు 2.5 లక్షల మందికి అన్నప్రసాద వితరణ

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టిటిడి నిరంతర యజ్ఞంగా అన్నప్రసాద వితరణ ఉచితంగా చేస్తోంది. 1985, ఏప్రిల్ 6న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేతులమీదుగా టిటిడి ప్రారంభించింది. తదుపరి 1994, ఏప్రిల్ 1న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం ట్రస్టుగా, తర్వాత దీనిని శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుగా నామకరణం చేశారు. మొదటగా తిరుమలలో కల్యాణకట్ట ఎదురుగా గల పాత అన్నదానం కాంప్లెక్స్‌లో అన్నదానం జరిగేది. ఇప్పటి వరకు శ్రీ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కు దాతలు దాదాపు రూ. 2,190 కోట్ల విరాళాలను అందించారు. ఎందరో దాతలు ఇచ్చిన నిధులతో నిర్విరామంగా అన్నప్రసాద వితరణ సాగుతోంది. వ్యక్తిగతంగా దాతల పుట్టిన రోజు, దాతల కుటుంబ సభ్యుల పేర్లతో, దాతల ట్రస్ట్ లు, కంపెనీల పేరుతో రూ.44 లక్షలు అందించవచ్చు. శ్రీవారి పుట్టిన రోజు అయిన శ్రవణా నక్షత్రం, శ్రీ పద్మావతీ అమ్మవారి పుట్టిన రోజు అయిన ఉత్తరషాడ నక్షత్రం, పంచమీతీర్థం, వైకుంఠ ఏకాదశి, శ్రీవారి, శ్రీపద్మావతీ అమ్మవారి ప్రత్యేక రోజులలో కూడా దాతలు విరాళంగా అందించవచ్చు. రూ. 44 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులు ప్రత్యేకంగా అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని టిటిడి కల్పించింది. విరాళం అందించే దాతల పేరును తిరుమల వెంగమాంబ అన్నప్రసాద భవనంలోని డిస్ ప్లే బోర్డులో ప్రదర్శిస్తారు. అదేవిధంగా ఒకరోజు అన్నప్రసాదాలను వడ్డిస్తారు. ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ రూ.44 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఉదయం అల్పాహారం కోసం రూ.10 లక్షలు, మధ్యాహ్నం భోజనం కోసం రూ.17 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.17 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తారు. తిరుమల, తిరుపతి, ఒంటిమిట్టలోని టిటిడి అన్నప్రసాదాలు వితరణ కేంద్రాల నుండి రోజుకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి సుమారు 2.5 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు.దాతలు రూ.44 లక్షలు అన్నప్రసాద వితరణకు విరాళం అందిస్తే, ఆ రోజంతా తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -1లోని 20, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ - 2లోని 31 కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరిలోని 9 కంపార్ట్ మెంట్లు, ఏటీసీ, ఎంబీసీ, టిబీసీ, పీఏసీ - 2, పీఏసీ - 4 కేంద్రాలు, శిలాతోరణం, కృష్ణతేజ వరకు బయటి క్యూలైన్లు, తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం కాంప్లెక్సులు, శ్రీగోవిందరాజ స్వామి ఆలయ అన్నప్రసాదరణ వితరణ కేంద్రం, రుయా ఆస్పత్రి, స్విమ్స్, మెటర్నిటీ ఆస్పత్రి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనం, ఒంటిమిట్టలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ చేస్తారు.ప్రతి రోజూ టిటిడిలో అన్నప్రసాదాల తయారీ, పంపిణీకి సుమారు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. అన్నప్రసాదాలు విభాగంలో పలువురు శ్రీవారి సేవకులు సేవలు అందిస్తున్నారు. తద్వారా భక్తులు నుండి టిటిడి అన్నప్రసాదం విభాగం విశేష ఆదరణ పొందుతోంది.

ప్రజలకు మంచి చేస్తుంటే వైసీపీ నేతలకు కడుపు మంట ఎందుకో: మంత్రి నారాయణ

విశాలాంధ్ర- నెల్లూరు:రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు మంచి చేస్తుంటే వైసీపీ నేతలకు కడుపు మండిపోతుందని మంత్రి పొంగూరు నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం పై వైసీపీ నేతలు అర్థరహిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తల్లికి వందనం డబ్బులు లోకేష్ అకౌంట్లోకి పోతున్నాయంటూ వైసీపీ దుష్ప్రచారం చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో అధికారులు ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని... దాన్ని వైసిపి జీర్ణించుకోలేక పోతుందని విమర్శించారు. ఒకే రోజు 67.25 లక్షల మందికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించామని వివరించారు. ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 42 లక్షల మందికి కేవలం 5000 కోట్లే ఖర్చు పెట్టిందని గుర్తు చేశారు. కుటుంబంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని.. ఒక్క పిల్లాడికి మాత్రమే ఇచ్చి కుటుంబంలో చిచ్చుపెట్టే సంస్కృతి తమది కాదని ఆయన అన్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు హామీని అమలు చేయబోతున్నామని నారాయణ స్పష్టం చేశారు. 2.25 లక్షల మందికి అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే చక్కటి భోజనం అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని చిన్నారులకు మేనమామ అని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి.. కంసుడి అవతారం ఎత్తారని విమర్శించారు. వైసిపి ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని.. అప్పులు,చెత్త మిగిల్చి వెళ్లారని మండిపడ్డారు. చంద్రబాబు సమర్థవంతమైన పాలనతో పరిస్థితులు చక్కబడుతు న్నాయని.. కొన్ని రోజులు ఓపిక పడితే హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు

రికార్డు స్థాయిలో శ్రీవారి భక్తులకు దర్శనం

విశాలాంధ్ర-తిరుమల :వేసవి రద్దీ నేపథ్యంలో తిరుమలలో భక్తుల తాకిడి మే నెల 15 వ తారీఖునుండి విపరీతంగా పెరిగింది.సాధారణంగా శు క్రవారం అభిషేక సేవ ఉన్న కారణంగా భక్తులకు దర్శన సమయం రెండు మూడు గంటలు పైగా తగ్గుతుంది.శుక్రవారం నాడు సాధారణంగా కేవలం 60 నుండి 65 వేల మంది భక్తులు మాత్రమే శ్రీవారిని దర్శించుకుంటారు.అయితే ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ లో వివిధ టీటీడీ విభాగాల సిబ్బంది సమన్వయంతో ఈ ఏడాది మే మరియు జూన్ మాసాలలోని శుక్రవారాలలో దాదాపు పదివేల మందికి పైగా భక్తులకు అదనంగా దర్శన భాగ్యం కల్పించడం జరుగుతున్నది. ఒక సారి దర్శన గుణాంకాలు పరిశీలిస్తే శుక్రవారాలైన మే 23న 74, 374 మంది, మే 30న 71,721 మంది, జూన్ 6న 72,174 మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించడం జరిగింది. జూన్ 13న రికార్డు స్థాయిలో 75,096 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం విశేషం.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

విశాలాంధ్ర- కలువాయి : మండల కేంద్రమైన కలువాయి లో సుసర్ల వారి వీధిలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలు పై 11 కెవి విద్యుత్ వైరు తెగి పక్కకి పడడంతో పెనుప్రమాదం తప్పినట్లు తెలుస్తుంది, గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే విద్యుత్ సిబ్బంది తెగిన విద్యుత్తు లైను పునరుద్ధరించారు.

ప్రజా చైతన్య సేవా సంఘం రక్త దాన శిబిరం

విశాలాంధ్ర-రాయచోటి: జూన్ 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ప్రజా చైతన్య సేవా సంఘం స్వచ్ఛంద సంస్థ నందు దీప రక్తనిధి వారి సహకారంతో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ప్రజా చైతన్య సేవా సంగం ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.చెన్నారెడ్డి సూచించారు. ఈ క్యాంప్ లో రక్త దాతల సహాయంతో బ్లడ్ శ్యాంపులస్ సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది రక్తం నష్టపోయి ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రసవ సమయంలో కూడా చాలా మంది రక్తం లేక ఇబ్బందులు పడే సందర్భాలు చాలా వున్నాయి. అలాగే ఆపరేషన్ అవసరం అయ్యినప్పుడు, ఇదే కరణలతో హాస్పిటల్ కి వచ్చేవారికి రక్తం కొరత లేకుండా వుండేటట్టు ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా బావించి రక్త దానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ టి.స్వాతి, ఎంఅండ్ఇ కె.పవన్ కుమార్, సిబంది పాల్గొన్నారు.

ఘనంగా తెదేపా యువనేతకు వివాహ మహోత్సవం వేడుకలు

విశాలాంధ్ర- బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నేత కానాల మల్లికార్జునరెడ్డి ఏడవ పెళ్లిరోజు వివాహ మహోత్సవ వేడుకలను మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి భారీగా కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ప్రజల కోసం ప్రజాసేవలో నిత్యం పనిచేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటూ కులమతాలకు అతీతంగా ప్రతి కార్యకర్తలను కాపాడుకుంటూ ప్రజల్లో నిత్యం ఉండేవాడని తాను బెంగళూరులో పారిశ్రామిక వేత్త ఉద్యోగ రీతిలో ఉద్యోగాలు యువతీ యువకులు కల్పిస్తూ మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలతో ముందుకు వస్తున్నారని ఇలాంటి యువ నేత ఎన్నో పెళ్లి రోజులు జన్మదినాలు జరుపుకోవాలని ఆయనకు ఆయన కుటుంబానికి ప్రజల ఆశీస్సులతో పాటు బ్రహ్మంగారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సాంబశివరెడ్డి, పూజా శివ యాదవ్, లగసాని గంగరాజు, సుధాకర్ యాదవ్, నాగయ్య యాదవ్, బసిరెడ్డి, రమణారెడ్డి, కానాల యువసేన నాయకులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర - జమ్మల మడుగు : ఆపదలో ఉన్నవారికి రక్తదానం అందించడం అంటే ప్రాణదానంతో సమానమని డాక్టర్ దిలీప్, డాక్టర్ శ్రీలత పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా దాల్మియా సిమెంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కౌన్సిలర్ వి. ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ 14న ప్రపంచ రక్త దాన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ రక్తదానం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 56 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాల్మియా ఫ్యాక్టరీ హెచ్ ఆర్ ఉమేష్ కొల్ హత్కర్,బ్లడ్ స్టోరేజ్ టెక్నీషియన్ నెల్సన్ మరియు బాలు పాల్గొన్నారు.

ప్రతి పేదింటా పండుగ వాతావరణం కల్పించిన ముఖ్యమంత్రి

ప్రతిపక్ష నాయకునిగా హామీ ఇచ్చారు ముఖ్యమంత్రిగా హామీ నెరవేర్చారు

విశాలాంధ్ర - ఖాజీపేట : రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థికి తల్లికి వందనం పేరుతో చదువుకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని ప్రతిపక్ష నాయకునిగా హామీ ఇచ్చి ముఖ్యమంత్రిగా హామీ నెరవేర్చడంతో రాష్ట్రంలో ప్రతి పేదింటా పండుగ వాతావరణం కల్పించిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రజల దీవెనలు అందుకుంటున్నాడని తెలుగుదేశం పార్టీ మండల నాయకులు రావులపల్లి పంచాయతీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాగ నాగేశ్వర కూడా చైర్మన్ గంగవరం ఆదినారాయణ రెడ్డి (బాబు) పేర్కొన్నారు. వీరు శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి పేదింటా పండుగ వాతావరణం నెలకొందని ఇద్దరు పిల్లలుంటే 26 వేలు, ముగ్గురు ఉంటే 39 వేలు, నలుగురు ఉంటే 52 వేలు, ఒక్కరే ఉంటే 13 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ చేశారన్నారు.తమ బిడ్డలు అందరూ చదివితేనే, ఆ తల్లికి అసలైన ఆనందం. ఒక బిడ్డకు కాదు, ఎంత మంది బిడ్డలు ఉన్నా "తల్లికి వందనం" ఇస్తానని చంద్రబాబు చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకొని ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి రూ.39,000 వేలు వేశారన్నారు.. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకొని పిల్లలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో, "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం"లో సన్న బియ్యంతో స్కూల్స్ తెరిచిన తొలిరోజే వండి విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్నిఅందిస్తున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో, విద్యా శాఖా మంత్రి లోకేష్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం పేరుతో మెనూలో మార్పులు చేసి పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకున్నారని వారు తెలియజేశారు.

నాటుసారా స్వాధీనం- ఒకరు అరెస్టు:సిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం లోని వైకోట రోడ్డులో శనివారం చెన్నరాజుపోడు క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్నట్లు రహస్యంగా అందిన సమాచారం మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐ టికె తులసి తమ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ మధుసూదన్ రాజు, సోమేశ్వర, బసిరెడ్డి, రమణారెడ్డి, శివప్రసాద్, ఓబులవారిపల్లి మండల పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ జయమ్మ అందరూ హుటాహుటిన చెన్నరాజుపోడు క్రాస్ రోడ్డు వద్దకు వెళ్ళి అన్ని వైపులా గాలింపు చర్యలు చేపట్టి అక్రమంగా 10 లీటర్లు నాటుసారా కలిగి ఉన్న గిరిజన మహిళ పాలెంకోట లక్ష్మమ్మ పట్టుకుని ఆమె వద్ద అక్రమంగా ఉన్న 10 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని సిఐ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అక్రమంగా విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు.అక్రమంగా నాటుసారా తయారు చేసే నేరస్తులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారుల నుంచి తప్పించుకోలేరన్నారు. పాత నేరస్తుల కదలికలపై, నాటుసారా తయారు చేసే అనుమానిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.పట్టుబడ్డ మహిళను అనంతరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామయ్యపాలెం గిరిజన కాలనీకి చెందిన మహిళాగా గుర్తించామని సిఐ తెలిపారు.మహిళా ముద్దాయికి కోర్టులో బెయిల్ మంజూరు అయినట్లు సమాచారం.

సుబ్రమణ్యం కుటుంబానికి అండగా ఉంటాం

ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు గ్రామపంచాయితీ పరిధిలోని దిగువపల్లికి చెందిన పిడికిటి బలరామయ్యనాయుడు కుమారుడు సుబ్రమణ్యం నాయుడు(65) రోడ్డు ప్రమాదంలో ఆఖస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి హుటాహుటిన దిగువపల్లిలోని మృతుని నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు.మృతునికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుబ్రమణ్యంనాయుడు మృతి చెందడం భాదాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.మృతుని కుటుంబ సభ్యుల దగ్గర కూర్చుని ఓదార్చి మీకు మేము అండగా ఉంటాం అధైర్యపడవద్దు అని భరోసా ఇచ్చారు.

రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి

విశాలాంధ్ర - నందలూరు : ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై మల్లికార్జున్రెడ్డి పేర్కొన్నారు. ఆడపూరు గ్రామంలో శనివారం ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ వాహన దారులు సరైన ధ్రువపత్రాలను తప్పక కలిగి ఉండాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను తప్పక ధరించాలని సూచించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

నవ ధాన్యలు సాగుతో అధిక ప్రయోజనం

విశాలాంధ్ర - సుండుపల్లి : మండలపరిధిలో రాయవరం గ్రామంలోని దిగువ జంగంపల్లికు చెందిన మద్దిరాల రవి శంకర్ వేసిన వేరుశెనగ పంటలో చుట్టూ సరిహద్దు పంటలు గా జొన్న, సజ్జ, అంతర పంటలు గా అలసంద, అనప, పెసర, కంది, ఎర్ర పంటలుగా ఆముదం వేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ యం ఎన్ యఫ్ ఇంచార్జి రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతి రైతు పలు పంటలు వేయడం వలన అధిక ప్రయోజనం పొందవచ్చునని, ప్రధాన పంటలో దిగుబడి తగ్గిన మిగతా పంటలో ఆదాయం పొందవచ్చునని వివరించారు. అనంతరం పెద్దినేని కాల్వ గ్రామంలోని బూడిదేటి పల్లిలో ఆ గ్రామ ఇంచార్జి ఎస్. వెంకటయ్య ప్రకృతి వ్యవసాయం విధానం గురించి, పియండిఎస్ విధానంలో నవ ధాన్యలు సాగు గురించి, అలాగే ముడుంపాడు గ్రామ ఇంచార్జి ఆంజనేయులు రైతులకు వివరించారు. ఇందులో యానీమాటర్ సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు గ్రామం ఆరోగ్య పురం నందు వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు అమృ నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి ప్రత్యేక పూల అలంకరణ, అభిషేకము, తదుపరి స్వామివారికి నైవేద్యం సమర్పించడం జరిగింది వచ్చిన భక్తులు శనివారం దర్శించు కున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగింది.శివరామపురం నివాసి పసుపులేటి. సంధ్యారాణి, బాలాజీలు మరియు కందుల. బాబు కుమార్, తేజస్విని 101 టెంకాయ కొట్టి మొక్కుబడి తీర్చుకొన్నారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

విశాలాంధ్ర-మదనపల్లి: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా చారిత్రాత్మక గుర్రంకొండలో హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్త వర్గీకరణ కనుగొన్న కార్ల్ లాండ్ స్టీనర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రక్తదాన శిబిరం ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 52 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబుబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ కృత్రిమంగా తయారు కానీ రక్తాన్ని సాటి మనిషి రక్తదానం చేస్తేనే మరొకరి ప్రాణాలు కాపాడిన వాళ్ళు అవుతామని మన శరీరంలో జీవధారగా ప్రవహించే రక్తం మరొకరి నిండు ప్రాణాన్ని నిలబెడుతుందని రక్తనిధి కేంద్రాల్లో రక్తం కొరత లేకుండా వరుస రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని నేను గుర్రంకొండలో తమ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి రక్తదాతకు శుభాకాంక్షలతో పాటు అభినందనలు తెలియజేశారు. హెల్పింగ్ మైండ్స్ గుర్రంకొండ ఇంచార్జ్ లు మొఖద్దర్, ఆబిద్ లను దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. హెల్పింగ్ మైండ్స్ గుర్రంకొండ ఇన్చార్జిలు మొఖద్దర్,ఆబిద్ మాట్లాడుతూ రక్తదానం యొక్క ఆవశ్యకతను ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ ప్రతి ఏటా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ సేవలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా ముందుకు తీసుకువెళతామని పేర్కొన్నారు.కార్యక్రమంలో గుర్రంకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమర్నాథ్, లెక్చరర్ జమీర్,మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ బాల చంద్ర నాయుడు, సిబ్బంది కృష్ణ,హెల్పింగ్ మైండ్స్ సభ్యులు యతీష్, మోహమూద్, సోహైల్,అర్షద్,ముస్తాఫ్, మొయినుద్దీన్,కిరణ్, సాంబ,జైయేంద్ర, సాయి,మిథున్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండర్‌కు ఘనంగా సన్మానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సంధర్భంగా ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో గల బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద సంస్థలకు మరియు రక్తదాతలకు సన్మాన కార్యక్రమంలో భాగంగా బ్లడ్ బ్యాంక్ డాక్టర్ గోపాల్, డా.కవితలు ఫ్రెండ్స్ బ్లడ్ డోనర్స్ ఫౌండేషన్ ఫౌండర్ మహమ్మద్ ఉమర్‌కు ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు. గత 5 సంవత్సరాలుగా తమ ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలు మరియు ఉచిత మెడికల్ క్యాంప్‌లు నిర్వహించామని, అలాగే ఆపద సమయంలో గర్భిణీ స్త్రీలకు ఎంతో మందికి రక్తదానం అందించడం జరిగిందన్నారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. రక్తదానం అనేది ప్రతి ఒక్కరు చేయాల్సిన బాధ్యత అని, యువకులు 3 నెలలకు ఒకసారి రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ఆదుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో ఎవరికైనా రక్తం కావాలంటే 80740 33598 అనే నంబరుకు సంప్రదిస్తే రక్తం అందించడం జరుగుతుందని తెలిపారు.

చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: టిడిపి బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం. శనివారం సందర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వీట్ కేసరి, పులగం, పల్లీల చట్నీ, పచ్చి పులుసుతో పాటు అరటి పండ్లు దాదాపు 1000 మందికి మంచి రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని ఆయన ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, రిటైర్డ్ ఏఈ రామ సుబ్బన్న యాదవ్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలపనూరు శ్రీనివాసులు, చింతల రాఘవేంద్ర యాదవ్, మూరబోయిన శ్రీనివాసులు యాదవ్, బంగి శివప్రసాద్, సీమాంధ్ర సంక్షేమ సంఘం పట్టణ ట్రెజరర్ రామచంద్ర రాజు, టైలర్ ప్రసాద్, రామయ్య గౌడ్, ఏసునాథ్ రెడ్డి, కర్ణ యాదవ్, గోపవరం సుబ్బారాయుడు, డ్రైవర్ బాషా, హరీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న

ఆప్కాస్ అంగన్వాడి మున్సిపల్ కార్మికులందరికీ అమలు చేయాలి

కడప కలెక్టర్ ఆఫీస్ వద్ద 16 సోమవారం రోజున ధర్నా : సీఐటీయూ

విశాలాంధ్ర-కడప : సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు నగర విస్తృత సమావేశం జరిగింది ఈ సమావేశంలో సిఐటియు నగర కార్యదర్శి పి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి సమస్యలు పరిష్కారం చేయడంలో గత ప్రభుత్వాలు ఏ విధానాలు అమలు చేశాయో ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా అవే విధానాలు అమలు చేస్తున్నాయి అని అనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు వాటికి నిదర్శనం గతం ప్రభుత్వంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఆప్కాస్ అవుట్సోర్సింగ్ కాంట్రాక్టు అంగన్వాడి ఆశ అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎవరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కాకుండా ఉండేవి ఇప్పుడు అధికారంలో ఉండే పెద్దలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము అధికారంలోకి వస్తే 25000 వేతనం కన్నా తక్కువ ఎవరైతే తీసుకుంటున్నారో వారందరికీ మేం అధికారంలోకి వస్తానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వంలో మరో కీలకమైన రంగం వైద్యరంగం వైద్యరంగంలో పనిచేస్తున్న ఆప్కాస్ కార్మికులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు ఇలా చూసుకుంటే ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న హౌసింగ్ రంగం కావచ్చు విద్యారంగంగా కావచ్చు ఏ రంగంలో పనిచేసే కార్మికుల కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయడం లేదు అందుకోసమే కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైనదని వారు ఈ సమావేశంలో అన్నారు అందులో భాగంగానే 16వ తేదీ సోమవారం రోజున కడప కలెక్టర్ ఆఫీస్ దగ్గర జరిగే ధర్నాల్లో ఆప్కాస్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు అంగన్వాడి ఆశ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి .లక్ష్మీదేవి, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్ .గోపి, జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద బ్రహ్మానంద రెడ్డి, మెడికల్ యూనియన్ నాయకులు మహేష్, పవన్ కార్మికులు పాల్గొన్నారు.

గొర్రెలకు నీలి నాలుక టీకాలపై

అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర -రాజంపేట: జాతీయ పశు వ్యాధి నియంత్రణలో భాగంగా శనివారం రాజంపేట మండలం హెచ్ సెల్ లో పల్లి గొల్లపల్లి గ్రామంలో నీలి నాలుక బ్లూ టంగ్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధన పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలలో నీలి నాలుక వ్యాధి యొక్క లక్షణాలను నీలి నాలుక టీకాల ఆవశ్యకతను తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో రాజంపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కే ప్రతాప్ హెచ్ చెర్లోపల్లి పశువైద్యాధికారిని డాక్టర్ కే భాగ్యవతి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఎం వరదయ్య, గోపాలమిత్రాలు ఎం భాస్కర్,సి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర - సుండుపల్లె : రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సొంటవారిపల్లి నందు టీబీ ముక్తా అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా అవగాహన కార్యక్రమం డాక్టర్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన టీబీ వ్యాధి గురించి అవగాహన కల్పిస్తూ టీబీ వ్యాధి 60 సం. పై పడిన వారికి షుగర్ ఉన్నవారికి హెచ్ఐవి ఉన్నావాకి పొగాకు, మద్యం తాగేవారికి టీబీ రోగుల వలన ఇంట్లో కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశం ఉంది. కావున రెండు వారాలు దగ్గు సాయం కాలం జ్వరం, ఛాతిలో నొప్పి, దగ్గినప్పుడు గళ్ళతో పాటు రక్తం పడడం, ఆకలి మందగించడం బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవాళ్లు పరీక్ష చేయించుకొని ఉచితంగా మందులు పొందవచ్చు న్నారు. పోషకాహారం కొరకు రూ.1000లు ఇస్తారు. ఈ కార్యక్రమంలో వీరనారాయణ, జయపాల్, సల్మాహన్, సుకన్య, నాగరత్నమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

విమాన ప్రమాదం మృతులకు సిఐటియు నివాళి

విశాలాంధ్ర -రాజంపేట : అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలోని మృతులకు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈనెల 12న అహ్మదాబాద్ నుంచి లండన్ కు బయలుదేరిన విమానం కొద్దిసేపట్లోనే వైద్య కళాశాలపై పడి కూలిపోయి వందలాదిమంది మృతి చెందడం అత్యంత బాధాకరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘోర ప్రమాదం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్, రమణ, సునీత, వెంకటమ్మ, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం ప్రాణ దానం కన్నా మిన్న

విశాలాంధ్ర-గాలివీడు : రక్త దానం ప్రాణ దానం కన్న మిన్న అని గాలివీడు యస్ ఐ.రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. 108 పైలెట్ రామాంజులు, సింగపూర్ ఆచారి,వారి అధ్యక్షతన దీప బ్లడ్ బ్యాంక్ రాయచోటి వారి సహకారంతో, గాలివీడు గేటు వద్ద ఉన్న ఆయుష్ చిన్నపిల్లల హాస్పిటల్ ప్రాంగణంలో డాక్టర్ మహేష్ నాయక్ వారి సహాయ సహకారాలతో దాదాపు 45 మంది రక్తదాతలతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోతున్న చాలామంది నిస్సహాయకులను మనం రోజు చూస్తూనే ఉన్నాం. అలాంటివారికి మన చేతనైన సహాయంగా రక్తదానం చేసి చేయించి పరోక్షంగా తెలియని వారిని కూడా ఆదుకోవడంలో ఇది ఒక గొప్ప బృహత్ కార్యమని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో దీప బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ఆయుష్ చిన్న పిల్లల ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ మహేష్ నాయక్ మరియు సిబ్బంది మరియు రక్త దాతలు పాల్గొన్నారు.

హాస్పిటల్లో తనిఖీ చేసిన ఎమ్మెల్యే పుట్టా

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం అర్బన్ ప్రైమర్ హెల్త్ సెంటర్ను మైదుకూరు ఎమ్మెల్యే ప్రతాప్ సుధాకర్ యాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పిటల్కు తాళాలు వేసి ఉండడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్త సేకరణ నమూనా కిట్లను హాస్పిటల్ బయట ఉంచడంతో సిబ్బంది అలసత్వంపై మండిపడ్డారు. జిల్లా వైద్యశాఖ అధికారికి ఫిర్యాదు చేసి అలసత్వం వహించిన సిబ్బందిని సస్పెండ్ చేయాలని కోరారు. అదేవిధంగా కలెక్టర్కు ఫిర్యాదు చేసి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హాస్పిటల్కు తాళాలు వేయడమేంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ మల్లేష్ హాస్పిటల్ వద్దకు పిలిపించి హాస్పిటల్ సిబ్బంది పనితీరు పట్ల చర్యలు తీసుకోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, టిడిపి సీనియర్ నాయకులు పుట్టా ప్రభాకర్ యాదవ్, టిడిపి నాయకులు మిల్లు శీను, శివపురం టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ఓ ప్రాణానికి ఆధారం

జే.బీ.వీ.ఎస్. ది ప్రిజర్వేర్ సేవ సమితి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రక్తదానం అనేది కేవలం వైద్య అవసరానికే కాకుండా గొప్ప మానవత్వానికి నిదర్శనం అని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్ రవిబాబు అన్నారు. కడప స్థానిక బాలాజీ నగర్ రోడ్ నెంబర్ 13 నందు ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా జే.బీ.వీ.ఎస్. ది ప్రిజర్వేర్ సేవ సమితి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రానికి నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కృతిమంగా తయారవ్వని వాటిలో రక్తదానం ఒకటి అని కావున మన చేతుల్లో ఉన్న మహోన్నతమైన సేవా కార్యక్రమం రక్తదానం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా మరో అతిథిగా విచ్చేసిన క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వి భాస్కర్ మాట్లాడుతూ ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, గర్భధారణ, చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలు ఇలా ఎన్నో సందర్భాల్లో రక్తం దొరకడం చాలా కీలకంగా మారడంతో రక్తం కొరత పెద్ద సమస్యగా మారుతుందని కావున ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం రెండు లేదా మూడుసార్లు రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా జే.బీ.వీ.ఎస్. ది ప్రిజర్వేర్ సేవ సమితి వ్యవస్థాపకుడు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అయిన అశోక్ మాట్లాడుతూ రక్తదానంపై యువతలో ఇంకా అవగాహన లేదని, దీనిపై ఒక మంచి అవగాహనని ప్రభుత్వం కలగజేసేందుకు ఉక్కు పాదం మోపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుమంత్, అరవింద్, నవీన్, రేవంత్, వసంత, ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, మేరా యువభారత్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చెన్నూరు : రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మురళీధర్ అన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధి, తదితర వ్యాధులు ప్రబలకుండా చేపట్టి అవగాహన సదస్సులో భాగంగా మండలంలోని కనుపర్తి, బలిసింగాయపల్లెలో కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు నివారించేందుకు దోమతెరలు తప్పనిసరిగా వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అలాగే ఈ వ్యాధులు సోకితే ఎటువంటి లక్షణాలు కలుగుతాయి, దీంతో ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారండ్రై డే గా పాటించి వ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ సుబ్బ రామయ్య, ఎంపీహెచ్ఎ చెన్నయ్య, ఏఎన్ఎం లక్ష్మీదేవి, అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మాక్ డ్రిల్, యోగాంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన స్థానిక వీరబ్రహ్మేంద్ర టూరిజం పార్కు నందు ఉండే ధ్యాన మందిరంలో ఇన్చార్జి ఎంపిడిఓ మల్లికార్జున ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ పత్తి సురేష్ ఘనంగా మాక్ డ్రిల్,యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు కనీసం ఒక గంట సూర్య నమస్కారం వాకింగ్ యోగా చేయడం వల్ల మానసిక ఉల్లాసమే కాకుండా, ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. పిల్లల్లో మెమరీ పెరుగుతుందని వ్యాధులకు దూరంగా ఉంటారని బెడ్ ప్రై జార్, ఘుగర్, వ్యాధికి గుండెకి సంబంధించిన వ్యాధులకు కూడా మంచిదేనా అన్నారు ప్రతి ఒక్కరూ యోగ ద్వారా మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు రాయపు రెడ్డి, నరసింహారెడ్డి,సచివాలయ కార్యదర్శులు ప్రభాకర్, రామ జ్యోతి, దస్తగిరి, వివిద సచివాలయ సిబ్బంది, వెలుగు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలిఅడుగు - ప్రతి ఇంట పండుగ వాతావరణం

మాట తప్పడం జగన్ వంతయితే, మడమ తిప్పకపోవడం చంద్రన్న వంతు

విశాలాంధ్ర - ఖాజీపేట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుని సుపరిపాలనలో తొలిఅడుగుగా ప్రతి ఇంట పండుగ వాతావరణం కల్పించిందని మాట తప్పడం జగన్ వంతయితే, మడమ తిప్పకపోవడం చంద్రన్న వంతని మండల ఐ టిడిపి అధ్యక్షుడు పొపన మల్లికార్జున్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రస్తుతం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని తెలుపుతూ జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి ద్వారా ఏ బిడ్డను చదివించాలో తేల్చుకో అని జగన్ అంటే,ప్రతి బిడ్డను చదివించమ్మా అని చంద్రన్న దీవించడం చూశామన్నారు.ఒక బిడ్డను బడికి పంపితే రూ.15,000.. ఇద్దరు బిడ్డలను బడికి పంపితే ఆ తల్లికి రూ.30,000 సంవత్సరానికి ఇస్తామని భారతి రెడ్డి చెప్పారు, జగన్ రెడ్డి చేయలేదు. అదే చంద్రబాబు నాయుడు చేసి చూపించారు. నాడు ఇద్దరు, లేదా అంతకన్నా ఎక్కువ బిడ్డలున్న తల్లికి జగన్ పరీక్ష పెట్టాడు.. నీ బిడ్డలలో ఏ బిడ్డను చదివించుకుంటావో నువ్వే తేల్చుకో అన్నాడు. కన్నపేగు ఏ బిడ్డను ఎంచుకోగలదు..! ఒకరికి మంచి, ఒకరికి చెడు చేయగలదా జగన్ రెడ్డి మాటలు విని ఆ తల్లుల కన్నీటి బాధలు విన్న నాయకుడు చంద్రబాబు నాయుడు.. "నీకు ఎంత మంది బిడ్డలుంటే ఆ బిడ్డలందరినీ చదివించే బాధ్యత నాది.. ప్రతి బిడ్డను చదువివించమ్మా.. నీ బిడ్డలందరికీ ఒక్కరికీ రూ.15,000 వేలు నేను ఇస్తాను" అన్నాడు. 67 లక్షల మంది తల్లులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ.. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఒక్కొక్కరికి రూ.15,000 వేలు చొప్పున ఆ తల్లుల అకౌంట్లలో జమచేసి చేతల్లో చూపించాడు. గాలి మాటలు చెప్పే నాయకుడు ఇచ్చిన మాటను ఆ గాలికే వదిలేస్తే బాధ్యత తెలిసిన వాడిగా చంద్రన్న చేతల్లో చేసి చూపించాడు.

మండల వ్యాప్తంగా యోగా మాక్ డ్రిల్

విశాలాంధ్ర - వేముల : వేముల మండలం వ్యాప్తంగా గ్రామ సమాఖ్యలు మరియు సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో యోగ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని యోగా మాస్టర్ ట్రైనర్ లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీమతి రాధా కృష్ణ వేణి మాట్లాడుతూ యోగా చేయడం దిన చర్యగా మార్చుకోవాలని సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుంది అన్నారు.మండల టీడీపీ నాయకులు శ్రీ పేర్ల శేషా రెడ్డి మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యం, దైనందిన జీవితంలో లో ఉత్సహం గా ఉండటానికి యోగా దోహద పడుతుంది అన్నారు. మాస్టర్ ట్రైనర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా యోగా మాక్ డ్రిల్ల్ శిక్షణ కార్యక్రమం అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్నారుని ప్రజలు, యువత, డ్వాక్రా మహిళలు చురుకుగా పాల్గొని జూన్ 21 అంతర్జాతీయ యోగ డే యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు నిజ జీవితం లో శారీరక మానసిక ధ్రుడుత్వం యోగా తో సాధ్యమని తెలిపారు.మండల వ్యాప్తంగా డ్వాక్రా మహిళలు కుటుంబ సమేతంగా యోగ మా క్ డ్రిల్ కార్యక్రమం లో పాల్గొన్నారు. యోగ మా క్ డ్రిల్లులో భాగంగా, సామూహిక శారీరక వ్యాయామం, సూర్య నమస్కారాలు,యోగ ఆసనాలు, ప్రాణాయామ, ధ్యానం, ఓం కారమ్.. మొదలైన అంశాల పైన శిక్షకులు అభ్యసనం చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో వేముల మండల స్థాయి అధికారులు గ్రామస్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది,కమ్యూనిటీ కో ఆర్డినేటర్ లు గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కార్యదర్శి కోశాధికారి డ్వాక్రా లీడర్లు డ్వాక్రా సభ్యులు డ్వాక్రా మహిళా కుటుంబ సభ్యులు యువత విద్యార్థులు రైతులు ప్రజలు విరివిగా పాల్గొన్నారు

వైకాపా విమర్శలు ప్రజలు నమ్మరు

చింతకుంట కుతుబుద్దీన్

విశాలాంధ్ర -ప్రొద్దుటూరు: సంక్షేమం, అభివృద్ధి సమపాళల్లా అందిస్తున్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంపై వైసీపీ విమర్శలను ప్రజలు ఎవ్వరు నమ్మరని టీఎన్టీయూసీ కడప పార్లమెంట్ అధ్యక్షులు చింత కుంట కుతుబుద్దీన్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చింతకుంట కుతుబుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 18గంటలు పని చేస్తున్నారని, అలాగే ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఉదయం 8గంటల నుండి రాత్రి 10గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తుంటే వైసీపీ సోషల్ మీడియా పెద్దాయనపై విమర్శలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

లక్ష్య గృహాల సోలార్ రూఫ్ టాప్ లక్ష్యం

విశాలాంధ్ర - జమ్మలమడుగు : వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు లక్ష్య గృహాలకి సోలార్ రూఫ్ టాప్ లక్ష్యంలో భాగంగా శనివారం కడప జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ జమ్మలమడుగులోని మోరగుడి గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అనేక ప్రోత్సాహాలతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు నిర్దేశాలు శులభతరం చేశామని తెలిపారు. బిసి వినియోగదారులకు ఒక్కో సోలార్ రూఫ్ టాప్ కు అధనంగా రూ.20000 రాయితీ రాష్ట్ర ప్రభుత్వము ఇస్తున్నదని అని అన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బ్యాంకర్ల సహకారాలు మెండుగా ఉన్నాయి అని తెలిపారు.సిబిల్ స్కోర్ ను బట్టి బ్యాంకులు రుణాలు వేగ వంతంగా ఇస్తారని చెప్పారు. ఒక్క కిలో వాట్ కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్తుని, అదే రెండు కిలోవాట్ల కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది అని పేర్కొన్నారు.ఈ విద్యుత్ ద్వారా గృహ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవడమే కాకుండా తిరిగి మిగులు విద్యుత్ యూనిట్ కి రెండు రూపాయల తొమ్మిది పైసలు వంతున పొందవచ్చని తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీల పొంది సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు సబ్సిడీ పోను పెట్టిన పెట్టుబడి వ్యయం తక్కువ సమయంలో తిరిగి వస్తుందని అన్నారు.రానున్న కాలములో విద్యుత్ వాహనాల ప్రాధాన్యత అధికంగా ఉంటుంది కావున వీటికి అవసరమైన విద్యుత్ శక్తి సోలార్ రూఫ్ టాప్ ద్వారా పొందవచ్చని అని తెలిపారు.సోలార్ విద్యుత్ ద్వారా వాతావరణములో కర్బన కాలుష్యాలను నివారించవచ్చని తద్వారా వాతావరణ వేడి శాతాన్ని తగ్గించ వచ్చని అన్నారు. ప్రజలు తమ ఇంటి పై కప్పు పై సోలార్ రూఫ్ టాప్ పలకలను ఏర్పాటు చేసుకుని శిలాజ ఇంధనాలైన బొగ్గు, క్రూడ్ ఆయిల్ ను పొదుపు చేసి తాము జీవిస్తూ భావితరాల వారి జీవనానికి తోడ్పాటు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.తదుపరి ప్రజలకు సోలార్ రూఫ్ టాప్ పై కరపత్రాలు అందించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణా రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజా గోపాల్, అసిస్టెంట్ ఇంజనీర్లు రజినీకాంత్ రెడ్డి, ఈశ్వర్, మోరగుడి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డా.వరుణ్‌కుమార్ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డికి ప్రజాసంఘాల తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం నరసింహులు మాదిగ(బ్రహ్మయ్య మాదిగ వర్గం) మరియు రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి, రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ హెల్త్ యూనివర్సిటీ అయిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నందు డా.వరుణ్‌కుమార్ రెడ్డిని నియమించడం హర్షణీయం అని తెలిపారు.

గ్లోబల్‌లో సీబీఎస్ఈ స్కూల్ ప్రారంభం

విశాలాంధ్ర-మదనపల్లె: ప్రభుత్వ అనుమతులు, విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో గ్లోబల్ సీబీఎస్ఈ స్కూల్ ప్రారంభించినట్లు స్కూల్ చైర్మన్ బి. గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యవరం వద్ద కొత్తగా నిర్మించిన భవనాల్లో గ్లోబల్ సీబీ ఎస్ఈ స్కూల్, బాల, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవనాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. విద్యాబోధనలో 20ఏళ్లకు పైగా అనుభవం వున్న తమకు, సీబీఎస్ఈ కోర్సులో విద్య అందించేందుకు అర్హతగల ఉపాధ్యాయుల ను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పి.ఎస్.వీణ, ప్రిన్సిపాల్, విద్యార్థు లు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం

విశాలాంధ్ర-సంబేపల్లె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ ఉపాధ్యాయులు స్థానిక ప్రజలతో కలిసి యోగ చేపట్టారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పిలుపుమేరకు ఉదయం 6 నుంచి 8 వరకు యోగ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 7.5 లక్షల మందితో యోగ నిర్వహించడమే లక్ష్యమని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ యోగ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. శారీరక ధృఢత్వానికి మానసిక ఉల్లాసానికి యోగ ఎంత దోహదపడుతుందన్నారు. పాఠశాల క్రీడా మైదానంలో అధికారులు ప్రజలు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి ప్రజలలో యోగ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలు హర్షణీయం.: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: తల్లికి వందనం హామీ అమలు హర్షణీయమని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానీ షరతులు,నిబంధనల వల్ల దాదాపు తొమ్మిది లక్షల మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హత కోల్పోవడం దురదృష్టకరమన్నారు. .ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి షరతులతో నిమిత్తం లేకుండా అమలు చేయాలి. .స్కీమ్ వర్కర్లు,కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల,పారిశుధ్య కార్మికుల పిల్లలకు షరతులు లేకుండా అమలు చేయాలి. .ఫీజ్ రీ ఇంబర్స్ మెంట్ పొందే కుటుంబాల లోని విద్యార్థులకు వర్తించక పోవడం సమంజసం కాదు.ఫీజ్ రీ ఇంబర్సమెంట్ ఉన్నత విద్యకు సంబంధించి నది.తల్లికి వందనం పాఠశాల,ఇంటర్ విద్యకు సంబంధించి నది.ఈ రెండింటికీ ముడి పెట్టడం బోడిగుండుకూ,మోకాలికీ ముడి పెట్టడమే అవుతుందన్నారు.

రక్త దాతలే నిజమైన హీరోలు: తులసిరెడ్డి

దానం మహా దానమని,రక్త దాతలు ప్రాణ దాతలని, వారే నిజమైన హీరోలని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా శనివారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రక్త దాతలు సృష్టి కర్త తో సమానమన్నారు. 18- 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ తమ రక్తాన్ని మూడు నెలల కో సారి దానం చేయవచ్చు అన్నారు.భగవంతుడు మానవునికి ప్రసాదించిన అమూల్యమైన ధనం,వరం రక్తం అన్నారు. రక్త దానం చేయడం వల్ల రక్త గ్రహీత ప్రాణం కాపాడబడుతుంది,రక్త దాత ఆరోగ్యం మరింత మెరుగవుతుంది అని తులసి రెడ్డి అన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కార్యక్రమం కలికిరిలో స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-కలికిరి: కలికిరి రెడ్డివారిపల్లె ప్రభుత్వ హై స్కూల్లో నిర్వహించబడిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కార్యక్రమం ఎంతో సార్థకంగా మరియు స్ఫూర్తిదాయకంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, మన దివంగత నేత మాజీ కలికిరి సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్ రెడ్డి గారి తనయుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి గారు హాజరయ్యారు.విద్యే మన భవిష్యత్‌ను నిర్మించే శక్తిగా పనిచేస్తుంది. విద్యార్థుల సమర్థవంతంగా ముందుకు రావాలంటే, ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది.

నెల్లూరు సెంట్రల్ జైల్లో కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించిన పెద్దిరెడ్డి

విశాలాంధ్ర - నెల్లూరు: నెల్లూరు చెముడు గుంటలోని జిల్లా సెంట్రల్ జైల్లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ములఖత్..అయ్యి పరామర్శించారు. ఈ అక్రమ కేసు నుండి గోవర్ధన్ రెడ్డి నిర్దోషిగా బయటికి వస్తారన్న విశ్వాసం పెద్దిరెడ్డి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ యంపి అనంత వెంకటరామిరెడ్డి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డిమేరీగ మురళీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి తో కలిసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతుకూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేకే.. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. అందులో భాగంగా కాకాణి గోవర్ధన్ లాంటి సౌమ్యుడిపైఅక్రమ కేసు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కోర్టులు కూడాఅభ్యంతరం తెలియచేస్తున్నసెక్షన్లు బనాయించి ఈరోజు వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు.ఇలా కేసులు పెడితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భయపడుతుందనికూటమినేతలు ఆలోచనలో వున్నారు.అక్రమ కేసులకు వైఎస్ఆర్సిపి భయపడదనికూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజుదగ్గర్లోనే ఉందన్నారు.ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కేసులు బనాయించే.. దుష్ట సంస్కృతిని.. కూటమి ప్రభుత్వం తెరమీదకి తీసుకొచ్చిందన్నారు. తప్పుడు కేసుల సంస్కృతి మంచి పద్ధతి కాదని ఎంతో మంది వారిస్తున్నప్పటికీ కూడా.. కూటమి.. వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు కొనసాగిస్తూనే ఉందన్నారు.ఇలాంటి దుష్ట సంస్కృతికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం.. భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.కాకాణి గోవర్ధన్ రెడ్డి పై అక్రమ కేసులు పెట్టి వారిని వేధించడం అన్యాయం. ఎప్పుడూ లేని విధంగా పీటీ వారెంట్లు వేస్తూ వరస కేసులు తో గోవర్ధన్ రెడ్డి గారిని అక్రమంగా నిర్బంధిస్తున్నారు.గతంలో ఎప్పుడూ లేని పరిస్థితులు ఈ రాష్ట్రంలో చూస్తున్నాం.నేను ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నాఇలాంటి వ్యవహారం ఏ ముఖ్యమంత్రి చేయలేదు అని రాంచంద్రారెడ్డి అన్నారు కచ్చితంగా దీనికి కూటమి ప్రభుత్వంమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందిరాష్ట్రంలో రాజ్యాంగం ఉందా అన్న విధంగా పాలన సాగుతుందిఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఐపై రిట్ పిటిషన్

దాఖాలు చేయనున్న సిపిఐ నాయకుడు

విశాలాంధ్ర- పీలేరు: ప్రభుత్వ అధికారాలను దుర్వినియోగం చేసిన పీలేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ పై హైకోర్టులో రిట్ పిటిషన్ వెయ్యబోతున్నానని పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను అడ్డుపెట్టుకొని గత నెల మే 11 వ ప్రభుత్వ రేషన్ బియ్యం నిలువ చేసి అక్రమ రవాణా చేస్తున్న వారిని పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసే ప్రయత్నంలో కేసు తారుమారు చేసి అధికార విధులను దుర్వినియోగం చేసి అక్రమంగా ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న వారిపై ఎటువంటి కేసు నమోదు చేయకుండా ప్రభుత్వ పిడిఎఫ్ బియ్యాలకు బిల్లులు ఉన్నాయని వదిలేయడం బియ్యం పట్టుకున్న అధికారుల పై దురుసుగా ప్రవర్తించడం పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో భారత రాజ్యాంగం ఆర్టికల్ 226 ప్రకారం రిట్ పిటిషన్ (లంచ్ మోషన్ లో) వేసి అధికార దుర్వినియోగానికి పాల్పడిన సీఐపై చర్యలు తీసుకోవాలని కోరుతామని ఆయన అన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-వాల్మీకిపురం:: వాల్మీకిపురం పంచాయతీ నెహ్రూ నగర్ కు చెందిన ఎంపీపీ స్కూల్ నందు తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ అయినందున పిల్లల తల్లిదండ్రులు ఆనందంతో కృతజ్ఞతా భావంతో సీఎం చంద్రబాబు నాయుడు ని నెహ్రూ నగర్ ఎంపీపీ పాఠశాల కమిటీ చైర్మన్ పావురాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం నాయకుల సమక్షంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తల్లులు మరియు పిల్లలు నగర ప్రముఖులు మండల నాయకులు కిరాభిషేకం జరిపించారు కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు పడినందుకు లబ్ధిదారులు ఎంతో సంతోషించి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేసినారు వారి ప్రభుత్వం కలకాలం ఇదేవిధంగా మంచి పనులు చేస్తూ పరిపాలించాలని ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చాలని లబ్ధిదారులు కోరుకున్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల టిడిపి అధ్యక్షుడు గుర్రం మల్లికార్జునరెడ్డి రాష్ట్ర కురువ సంఘం అధ్యక్షుడు వల్లిగట్ల రమణగారు రాజేంద్ర చారి గారు సి వి నారాయణ గారు మురళి కోసూరు రమేష్ ఆది దండోరుపల్లి గోవిందు రమణ కేకే మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి లబ్ధిదారుల తల్లిదండ్రులు వారి పిల్లలు పాల్గొన్నారు

సంపూర్ణ ఆరోగ్యం యోగతోనే సాధ్యం

విశాలాంధ్ర- పీలేరు: సంపూర్ణ ఆరోగ్యం యోగతోనే సాధ్యమనియోగా తెరపిస్ట్ డాక్టర్ పి.వి ఎస్ లక్ష్మి పేర్కొన్నారు.పీలేరు మండల కేంద్రంలో యోగాంధ్ర ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నూతన ఎమ్మార్వో శివకుమార్ పంచాయతీ ఈవో గురు మోహన్ డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్ మరియు హెల్త్ డిపార్ట్మెంట్ స్టాఫ్ ఇంటర్నేషనల్ యోగ డే కామన్ యోగ ప్రోటోకాల్ ను యోగా తెరపిస్ట్ డాక్టర్ పి.వి ఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటర్నేషనల్ న్యాచురపతి ఆర్గనైజేషన్ (%×చీూ%)ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కో కన్వీనర్ గా డాక్టర్ పి.వి. ఎస్ లక్ష్మి.11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 సందర్భంగా ఇంటర్నేషనల్ న్యాచురోపతి ఆర్గనైజేషన్ మరియు సూర్య ఫౌండేషన్ వారు అనేక సంవత్సరాలుగా యోగా రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా విశిష్ట సేవలు అందిస్తున్న టీవీఎస్ లక్ష్మిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోకన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగినది గత పది సంవత్సరములుగా అంతర్జాతీయ యోగా దినోత్సవం కరోనా సమయంలో కూడా ఆన్లైన్లో ద్వారా రెండు లక్షల మందికి కామన్యగ ప్రోటోకాల్ పై శిక్షణ ఇచ్చి ఆన్లైన్లో పాల్గొనేలా చేసినందుకు ఐ ఎన్ ఓ వారు ఈ పదవిని ఇవ్వడం జరిగింది హర్షవర్తంగా అన్ని జిల్లాలలో కామన్ యోగ ప్రోటోకాల్ పై శిక్షణ ఇచ్చి అనేక ప్రాంతాలలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం అనేక మందితో చేయించడమే ఈ పదవి ముఖ్య ఉద్దేశమని ఈ పదవిని తనకు ఇచ్చినటువంటి ఐ.ఎన్.ఓ నేషనల్ కోఆర్డినేటర్ అనంత్ బిరాదర్ న్యూఢిల్లీ వారికీ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పివిఎస్ లక్ష్మీ మరియు డాక్టర్ రాయల సుధాకర్ రాయలుపాల్గొన్నారు.

విమానం కూలిపోవడం బాధాకరం

అన్నమయ్య డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్



విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : ఎయిర్ ఇండియా విమానం కూలిపోయి పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర మనోవేదనకు గురిచేసిందని అన్నమయ్య డిస్టిక్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ సెక్రటరీ అమీర్ అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గుజరాత్ లో జరిగిన విమాన ప్రమాదంలొ మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాదం అత్యంత విషాదకరమైనదని, తీవ్రమైన దిగ్భ్రాంతి కలుగ చేసిందని తెలియజేశారు. గతంలో కూడా ప్రయాణికులు చాలా సందర్భాలలో సోషల్ మీడియా ద్వారా విమాన సంస్థల సర్వీసులు, సీట్లు సరిగ్గా లేవని పేర్కొనడం

తల్లికి వందనం పై వైకాపా దుష్ప్రచారం మానాలి

విశాలాంధ్ర-సంబేపల్లె: కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం కార్యక్రమంలో తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతూ ఉంటే వైకాపా నాయకులు కార్యకర్తలు అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని తెలుగుయువత రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి అశోక్ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2000 రూపాయలు లోకేష్ జేబుల్లోకి పోయాయి అంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేయడం సంస్కారం కాదన్నారు. అలా అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో 15000 చెప్పి13000 మాత్రమే తల్లుల ఖాతాలో జమ చేశారని అప్పట్లో 2000 రూపాయలు జగన్ జేబులోకి వెళ్లిందా అని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం ఇప్పుడు 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తోందన్నారు. కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్ మోహన్ రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేశారన్నారు. బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ను నాశనం చేసింది జగన్ మీరు కాదా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఈ పథకం కోసం కేవలం రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు మేర ఖర్చు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందం చూస్తున్నామన్నారు ఇప్పటికైనా వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధికి సహకరించాలని హితవుపలికారు.

హామీలు అమలు చేయలేక చేతులు ఎత్తేసిన కూటమి ప్రభుత్వం

సూపర్ సిక్స్ ఎక్కడ- మదనపల్లె జిల్లా హామి ఏమైంది

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్

విశాలాంధ్ర-మదనపల్లె: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజలను మోసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ విమర్శలు గుప్పించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఏ ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయడం లేదని ముఖ్యంగా తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు కోత పెట్టడం దుర్మార్గం అన్నారు. మదనపల్లి మెడికల్ కాలేజ్, మదనపల్లి జిల్లా,బి టి కళాశాలను యూనివర్సిటీ, కడప బెంగుళూరు రైల్వే లైన్ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏడాది పాలనలో ఇచ్చిన సూపర్ సిక్స్ పతకాలను అమలు చేయలేక చేతులు ఎత్తేశారని ఎద్దేవా చేశారు. అన్నదాత సుఖీభవ ఎప్పుడూ అని నిలదీశారు. ఫ్రీ బస్సు పథకం అమలు చేయడానికి ఏడాది సరిపోలేదా అని ప్రశ్నించారు. చెతగాని కూటమి ఎన్నికల హామీలు మరియు పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. రాష్ట్రంలో కేవలం పోలవరం, రాజధాని రెండే కాదని ప్రజలకు ప్రతిఒక్కటీ అవసరమేనని, పాలకులు రాష్ట్రంలో ఉన్న అన్ని సమస్యలపైనా దృష్టి సరించాలని, లేకపోతే మోసగాళ్లుగా ముద్ర వేసుకుంటారని హితవు పలికారు. మదనపల్లిని జిల్లా గా ప్రకటించి, మెడికల్ కళాశాలను తొందరగా పూర్తి చేయాలనీ డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : రాష్ట్రంలో తల్లుల కోసం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ రాయచోటి టిడిపి కార్యాలయంలో ఘనంగా సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మండల మహిళ టీడిపి నాయకులు, పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళలు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.పథకం అమలుతో తల్లుల ఆర్థిక స్థితి మెరుగవుతుందని మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

తల్లికి వందనంపై బులుగు విష ప్రచారాలు మానుకోవాలి: దిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ఎన్నికల సందర్భంగా రాష్ట్రప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి మాటను నిలబెట్టుకున్నామని జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు ఇస్తామంటూ మాట చెప్పి అధికారంలోకి వచ్చాక ఒక్క విద్యార్థికి మాత్రమే ఇచ్చి విద్యార్థులకు వైయస్ జగన్మోహన్ రెడ్డి తీరని ద్రోహం చేశారని చెప్పారు. తల్లికి వందనం పథకం పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బులుగు బ్యాచ్ నారా లోకేష్ పై తప్పుడు విష ప్రచారం చేస్తుందని, వైసీపీ నేతల దిగజారుడు ఆరోపణలు ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ పాలనలో రూ.13000 ఇచ్చారు కదా అంటే రూ. 2000 వైయస్ జగన్మోహన్ రెడ్డి జేబులోకి పోయాయా లేక తాడేపల్లె ప్యాలస్కు చేరాయా అని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వంలో 42 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే అమ్మబడి పథకం అందిస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం అందిస్తుందని వివరించారు. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని మాయ మాటలు చెప్పిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి బడుగు,బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని తెలిపారు. ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే ప్రతి విద్యార్థి చదువుకునేందుకు దోహదపడే విధంగా నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లోకి డబ్బులు కూటమి ప్రభుత్వం వేస్తుంటే స్వాగతించకుండా తప్పుడు ప్రచారాలు చేయడం జగన్మోహన్ రెడ్డి దిగుజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఈ పథకం కోసం కేవలం రూ.5 వేల కోట్లు ఖర్చుపెడితే కుటమి ప్రభుత్వం రూ పదివేల కోట్లు మేర ఖర్చు చేస్తుందని విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు వేస్తుందని తెలిపారు. విద్యార్థులకు అందించే చిక్కీలు, కోడిగుడ్లు, కందిపప్పు లో కూడా వైసిపి నాయకులు కమీషన్లు తీసుకున్న నీచ చరిత్ర మీది కదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి నిధులు ఎప్పుడు పడతాయా అని విద్యార్థులు వారి తల్లిదండ్రులు వేచి చూసేవారని కానీ కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో నగదు జమ చేయడం అంటే విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థం అవుతుందని ఆయన అన్నారు. తల్లికి వందనం పొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు సంతోషంగా ఉంటే వైయస్ జగన్మోహన్ రెడ్డి మరియు బులుగు బ్యాచ్ మాత్రం కళ్ళల్లో నిప్పులు వేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జమ్మలమడుగు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యూత్ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, నాగేంద్ర యాదవ్, దువ్వూరు మురళి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు వైద్య అధికారిగా డాక్టర్ డి.గణేష్

విశాలాంధ్ర - వీరబల్లి : వీరబల్లి పశువైద్యాధికారిగా డాక్టర్ గణేష్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అదే స్థానంలో పనిచేస్తున్నటువంటి డాక్టర్ నాగరాజు గాలివీడుకి బదిలీ కావడం జరిగింది. డాక్టర్ గణేష్ విలేకరులతో మాట్లా డుతూ ఇంతకు మునుపు వీరబల్లి మండలంలో పని చేసి మళ్లీ వీరబల్లి మండలానికి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పశువులకు ఆరోగ్య విషయాలపై శ్రద్ధ చూపుతానన్నారు. ప్రజలకు ఎప్పుడు అందు బాటులో ఉండి మూగజీవాలకు సరైన వైద్యం అందిస్తానని తెలిపారు.

ఎస్‌బివిఆర్ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర -బద్వేలు : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యోగాంధ్ర 2025 లో భాగంగా బద్వేల్ రెవిన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ ధ్యక్షతన మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి పర్యవేక్షణలో కళాశాల ప్రాంగణంలో యోగ శిక్షకులు నందగోపాల్ అమర్నాథ్ రెడ్డి చే యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా అనేది ఒక వ్యక్తి తన శరీరానికి, మనసుకు ఆత్మకు సంబంధించిన సమతుల్యతను సాధించడం జరుగుతుందన్నారు. మానసిక ,శారీరక ఆనందం పొందడంతో పాటు శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఒత్తిడిని తగ్గించడానికి మరియు మానసిక స్పష్టతను పెంచడానికి తోడ్పడుతున్నారు. యోగ ట్రైనర్ నంద గోపాల్ సూచనల ప్రకారం యోగ సాధన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్, రెవెన్యూ, పోలీసు, మెడికల్ డిపార్ట్మెంట్ అధికారులు మరియు సిబ్బంది, ఇతర డిపార్ట్మెంట్‌ల ఉద్యోగులు,ఎస్.బి.వి.ఆర్ కళాశాల సిబ్బంది, ఎస్.బి.వి ఆర్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఈవోతో సర్పంచు బేటీ



విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె ఈవో మాధవరెడ్డితో శనివారం సర&ంచు ఆర్ శ్రీనివాసులు బేటీ అయ్యారు. మైలవరం మండలం వేపరాల నుండి బదిలీపై వేంపల్లి గ్రామపంచాయతీ ఈవోగా మాధవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వేంపల్లి సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు ద్వారా వేంపల్లి గ్రామపంచాయతీ స్థితిగతులు గురించి అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ వేంపల్లి గ్రామపంచాయతీలో ఆరు నెలలుగా ఈవో లేకపోవడం వచ్చిన డిప్యూటేషన్ పైన ఉండడం ఆయన మళ్లీ వెళ్లడం వల్ల వేంపల్లి గ్రామపంచాయతీ నందు పారిశుద్ధ్య సమస్య, త్రాగునీటి సమస్య లు ఏర్పడ్డాయన్నారు. కావున వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల జీతభ త్యాలు, పారిశుద్ధ సమస్యలు మరియు త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని వేంపల్లి సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు ఆదేశించారు.

యోగా ఆంధ్రాలో భాగస్వాములం అవుదాం

విశాలాంధ్ర - రామాపురం : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యోగాంధ్రలో మన వంతుగా భాగ్య స్వాములం అవుదామని మండల ప్రత్యేక అధికారి విశ్వనాథ్ పిలుపునిచ్చారు మండలంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం చేపట్టిన యోగాసనా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండి యోగాసనాలు చేయడం వల్ల శారీరకంగా దృఢంగాను చదువు పట్ల ఏకాగ్రత పెరిగి శారీరకంగా దృఢంగా ఉండవచ్చునని అన్నారు ఈనెల 21న ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన రాష్ట్రంలోని విశాఖపట్నంలో పాల్గొంటారని అందుకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యోగా ఆంధ్ర నినాదంతో రాష్ట్రంలో ఐదు కోట్ల మందితో యోగాసనాలు చేయించాలనే సంకల్పంతో గత నెల 21 నుండి నెలరోజుపాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగ మాస్టారులతో శిక్షణ ఇప్పిస్తూ విద్యార్థులను యువతను ఉద్యోగస్తులను మహిళలను భాగస్వామ్యం చేస్తూ శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు ఈ అవకాశాన్ని ముఖ్యంగా విద్యార్థులు యువత వినియోగించు కొని మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా తాసిల్దార్ వెంకటేశ్వర్లు ఎంఈఓ2 జయచంద్ర మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి పాఠశాల ఉపాధ్యాయులు మండలంలోని 13 పంచాయతీల కార్యదర్శులు మోడల్ స్కూల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యవంతమైన జీవితం

విశాలాంధ్ర-పులివెందుల: యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం తోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యం అవుతుంది అని రక్తనిధి మెడికల్ అధికారి డాక్టర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయసు నిండి 45 కేజీల బరువు ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, యువత సామాజిక సేవా బాధ్యత తో రక్తదానం చేయడం అలవరచుకోవాలని, స్వచ్ఛందంగా ఏడాదికి 3 సార్లు అయినా రక్తదానం చేసే వారికే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యం అవుతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో స్టాఫ్ నర్స్ లు లత, అపర్ణ, రక్తనిధి కౌన్సిలర్ రజిని, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ లో మరో హామీ అమలు

డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర -అట్లూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల లో తల్లికి వందనం హామీ అమలు చేశారని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం కడప పట్టణంలో స్థానిక మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మరో అడుగు కూటమి ప్రభుత్వం ముందు కెసిందని తెలిపారు. విద్యార్థుల చదువుల నిమిత్తం ఒక్కో విద్యార్థికి ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి 13000 రూపాయల చొప్పున తల్లుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై సుమారు 8500 కోట్ల రూపాయలు తల్లికి వందనం పథకానికి ఖర్చు పెడుతున్నారని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచిర్యాంకులు తీసుకురావాల నే మంచి ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం విడుదల చేసిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఉచిత బస్సు తదితర సంక్షేమ పథకాలు కూడా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కడప జిల్లాలో కూటమి ప్రభుత్వానికి అండగా బిజెపి నేతలు జనసేన కార్యకర్తలు ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ లక్ష్యమే తమ నాయకుల కార్యకర్తల లక్ష్యమని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింపచేయాలి

సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న మాట కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

సబ్ -కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నిరసన

విశాలాంధ్ర-మదనపల్లె: రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన "తల్లికి వందనం" కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారు. సుమారు 10098 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి గారు ప్రకటించారు. అయితే రాష్ట్రంలో 48 వేలమంది మున్సిపల్ ఇంజనీరింగ్ మరియు పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ కాకపోవడం కార్మికులందరినీ తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న మాట కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మదనపల్లి మున్సిపాలిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ చలపతి నాయుడు ప్రభుత్వాన్ని కోరారు . శనివారం మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపు చేయాలని కోరుతూ సబ్ –కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మదనపల్లి కమిటీ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమపథకాలన్నీ వర్తింపజేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయి. ఇంజనీరింగ్ కార్మికులు చాలీ చాలని వేతనాలతో బతుకుతున్న తమ కుటుంబాలకు కూడా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటున్నారని తెలిపారు. ఒకే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలుచేస్తామని తెలుగుదేశం కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని,కానీ ఆచరణలో వచ్చేటప్పటికి అందుకు భిన్నంగా మున్సిపల్ కార్మికుల పిల్లలకు మొండి చేయి చూపారని ఆరోపించారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం తో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమపథకాలని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్,ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, జిల్లా సమితి సభ్యులు దేవా, ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షుడు వాసు, శ్రీనివాసులు ఇంద్రాణి,జానకి,రాధా, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గం వారి నిక్కా వేడుకల్లో రెడ్యం

విశాలాంధ్ర - ఖాజీపేట : మండలపరిధిలోని, పత్తూరు పంచాయతీ, దాయంఖాన్ పల్లెగ్రామానికి చెందిన ఏ.ఆర్ టొబాకో కంపెనీ ప్రొప్రైటర్ దుర్గం అబ్దుల్ రసూల్ ఏకైక పుత్రిక నూర్ - ఏ - అయిన్, మానిక్ భాషల నిక్కా వేడుకలు శనివారం మధ్యాహ్నం కడప నగరంలోని వై.యస్. ఆర్ ఆడిటోరియంలో జరిగింది ఈ నిక్కా వేడుకల్లో వైఎస్ఆర్సిపి నేత ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి నేత కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కలకాలం చూడముచ్చటైన జంటగా ఉండాలని అల్లాను ప్రార్థించినట్లు రెడ్యం పేర్కొన్నారు.

కూటమి నాయకులపై దాడులు చేస్తే సహించం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : కూటమి నాయకులపై దాడులు చేస్తే సహించం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్,కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, తనయులు సాయివికాస్ రెడ్డి,మరియు సింగమాల మల్లిఖార్జున రెడ్డి వైసిపి అరాచక అల్లరి మూకలను హెచ్చరించారు. ఓబులవారిపల్లి మండలంలోని తల్లెంవారిపల్లికి చెందిన బిజెపి మాజీ మండల అధ్యక్షులు రాజగోపాల్ రెడ్డి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. వైసిపి దాడుల్లో గాయపడి తిరుపతి మారుతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజగోపాల్ రెడ్డి ని ఎమ్మెల్యే,మరియు వరలక్ష్మి, సాయివికాస్ రెడ్డి, సింగమాల మల్లిఖార్జున రెడ్డి పరామర్శించారు. బాధితుని ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. రాజగోపాల్ రెడ్డి కుమారుడు గోవర్ధన్ రెడ్డికి ధైర్యం చెబుతూ మీకు మేము అండగా ఉంటాం అధైర్యపడవద్దు అని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని వైసిపిని హెచ్చరించారు.దాడికి పాల్పడిన వైసిపి అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో దాడులకు రెచ్చగొట్టే అరాచక శక్తులను అణిచివేసి ప్రశాంతత కల్పించాలని పోలీసులను కోరారు.

తెరచాటు దోపిడీ..!

థియేటర్లలో క్యాంటీన్ నిర్వాహకుల దందా

బయటకంటే మూడు రేట్లు ధరలు ఎక్కువ -టికెట్ల కంటే కూల్ డ్రింక్స్, స్నాక్స్ ధరలు డబుల్

సామాన్యుడు సకుటుంబంగా సినిమాకు వెళ్లలేని పరిస్థితి -వసతుల కల్పనపై దృష్టి సారించని థియేటర్ల యాజమాన్యాలు

విశాలాంధ్ర -రాజంపేట: ఉరుకులు, పరుగులు జీవితంలో మానసిక ప్రశాంతత కోసం కాస్త రిలాక్స్ అవుదామని సినిమాకు వెళ్తే.. సరదా తీర్చేస్తున్నారు. సినిమా హాలులో అడుగు పెట్టినప్పటి నుంచి బయటకు వచ్చేవరకు ఒకటే ధరల బాదుడు. వాహనం పార్కింగ్ వద్ద మొదలయ్యే దోపిడీ పర్వం బయటకు వచ్చేవరకు సాగుతోంది. టికెట్ ధరల కంటే మించి స్నాక్స్ ధరలతో అసలు సినిమా చూపిస్తున్నారు థియేటర్ల యాజమానులు. ఇదేంటని అడిగితే ఇక్కడింతే అని నిర్లక్ష్య సమాధానం. తీసుకుంటే తీసుకోండి.. లేకుంటే లేదు అనే హుంకరింపు.దీంతో కుటుంబంతో వచ్చిన సామాన్యులు తప్పని పరిస్థితుల్లో జేబులోని పర్సును ఖాళీ చేసుకుంటున్నారు.థియేటర్లలో జరుగుతున్న దందాపై చర్యలు తీసుకోవలసిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రేక్షకులకు శాపంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో థియేటర్ల యాజమాన్యాలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందనంగా సినిమా దోపిడి మూడు పువ్వులు.. ఆరు కాయలుగా జోరుగా సాగుతోందని చెప్పడంలో సందేహం లేదు. రాజంపేట పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి సినిమా థియేటర్లకు కాసేపైన వినోదాన్ని ఆస్వా దిద్దామనే ఆలోచనతో వెళ్లే సామాన్య ప్రేక్షకుల జేబుకు చిల్లు పడుతోంది. తిను బండారాలు, వాహనాల పార్కింగ్ ఇలా ప్రతి చోటా దోపిడీ రాజ్యమేలుతోంది. అత్యధిక రేట్లు వివరాలతో ఫ్లెక్సీలను ధైర్యంగా ప్రదర్శించడమే కాదు. ఆ మొత్తాన్ని సినీ ప్రియుల ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నారు. దీంతో సినిమాకు వెళ్లడాం అనే మాట వినేసరికి సగటు జీవి ఆలోచనలో పడిపోతున్నాడు.మామూలు సంగతి సరే..సౌకర్యాల కల్పన విషయాన్ని మాత్రం థియేటర్ల యాజమాన్యాలు విస్మరించాయి. సగటు మానవునికి వినోదం కలిగించేవి సినిమాలే.. కానీ అక్కడికి వెళ్లే ప్రేక్షకుడిని యాజమాన్యాలు పిండి చేస్తున్నాయి. అడ్డు అదుపు లేని ధరలతో నిలువు దోపిడీ చేస్తున్నాయి.నియంత్రణ లేని చర్యలతో దోచుకుంటున్నాయి. ఇదేమని అడిగితే.. ఇక్కడ ఇంతే అంటూ సమాధానం చెబుతున్నారు.వీరి అక్రమాలకు అడ్డుకట్ట వేయవలసిన అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారు.అందుకే థియేటర్ల యజమానులు ఇష్టారాజ్యం నడుస్తుంది. కళ్ళు ఎదుటే నిబంధనల ఉల్లంఘన జరిగినా అధికారులకు అవేమీ కనిపించకపోవడం గమనార్హం. దీని వెనక మతలబు ఏమిటో అర్థం కాని పరిస్థితి. సామాన్యుడు సరదా కోసం సినిమా హాలుకు వెళితే..అక్కడ లేనిపోని నిబంధనల పేరిట జోబులు ఖాళీ అవుతున్నాయి.రంగుల రంగస్థలంలో ఆనందిద్దామని వెళ్లే వారికి యాజమాన్యాలు ధర భారంతో దుఃఖాన్ని మిగిలుస్తున్నాయి.అదనపు వసూళ్లతో నిలువునా దోచేస్తున్నాయి. టికెట్ల ధరలకంటే తిను బండారాలు మూడు రెట్లు ఎక్కువ ధరలకు విక్రయాలు చేస్తున్నట్లు ప్రేక్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వర చర్యలు తీసుకొని సినిమా థియేటర్లలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రేక్షకులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేయబడతారో లేదో వేచి చూడాల్సిందే.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా డా.వరుణ్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -ప్రొద్దుటూరు: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ టీ.డీ వరుణ్‌కుమార్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయానికి కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోని 8మంది వైద్య నిపుణులతో కూడిన బృందంలో డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డికి స్థానం లభించింది. నూతనంగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యులు 3సంవత్సరాల పాటు పదవుల్లో కొనసాగనున్నారు. వైద్య రంగంలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికవడం పట్ల ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, అధ్యాపకులు డాక్టర్ కూరపాటి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మధుసూధన్, ఎస్ఎల్‌టిఏ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, సీసీఎస్ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ జనార్ధన్ రెడ్డి, కడప జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు రమణలు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సంధర్భంగా డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఈ పదవిలో ఉన్నంత కాలం తగిన సలహాలు ఇస్తూ రాష్ట్రంలో వైద్యాభివృద్ధికి పాటుపడతానని ఆయన హామి ఇచ్చారు.